నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, శనివారం 24 ఆగస్టు 2024 | VIKARABAD



రుణమాఫీ ఎందుకు కాలేదని కొత్తూరు ఏవో గోపాల్‌ను అడుగుతున్న మండల రైతులు



రుద్రారం గ్రామ యూనియన్ బ్యాంకులో కిక్కిరిసిన రుణమాఫీ కాని బాధితులు

# సారూ.. మాకెప్పుడో రుణమాఫీ ?

**మండల వ్యవసాయ కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు**

**ఒక్కోరైతుది ఒక్కో సమస్య.. ఒకే రేషన్‌కార్డుపై నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి రూ. 2 లక్షలకు పైగా రుణం**

**ఆప్కాబ్ నుంచి ఇచ్చిన రుణం మాఫీ కిందకు రాదంటూ కొత్త మెలిక**

**బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డులో నంబర్, నేమ్ మిస్ మ్యాచ్ అంటూ తిరస్కరణ**

**సగం మంది రైతులకే రుణమాఫీ**

**కొత్తూరు మండలం రెడ్డిపాలెంలో 110 మంది రైతులకుగాను కేవలం 15 మందికే మాఫీ**

కొత్తూరు, ఆగస్టు 23 : సారూ.. మాకెప్పుడవుతుంది రుణమాఫీ అంటూ రైతులు కొత్తూరు మండల వ్యవసాయ కార్యాయలం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్తూరు మండలంలో సగానికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో పాస్‌పుస్తకాలు, బ్యాంకు బుక్కులు పట్టుకుని మండల వ్యవసాయ అధికారి చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం ఏ నిబంధనలు లేవు అందరికీ మాఫీ అవుతుందని చెప్పిన మాటలు నీటి మూటలేనా అంటూ వాపోతున్నారు. ఏవేవో కారణాలు చెప్పి రుణమాఫీ నుంచి తమను తప్పిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇలా చాలామంది మాఫీ అర్హత కోల్పోయేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధలను మార్చిందని రైతులు మండిపడుతున్నారు. మూడు విడుతల్లోనూ ఎంతో మంది రైతులకు మాఫీ కాలేదు. మండలంలోని రెడ్డిపాలెంలో రుణం తీసుకున్న రైతులు 110 మంది ఉంటే వారిలో కేవలం 15 మందికే పంట రుణం మాఫీ అయింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన తీరును అర్థం చేసుకోవచ్చని మండలవాసులు పెదవి విరుస్తున్నారు.



### 110 మంది ఉంటే 15 మందికే మాఫీ అయింది..

కొత్తూరు మండలంలోని రెడ్డిపాలెంలో 110 మంది రైతులు లోన్ తీసుకుంటే కేవలం 15 మందికే మాఫీ అయింది. గూడూరు గ్రామ పంచాయతీకి ఆమ్లెట్ విలేజ్‌గా రెడ్డిపాలెం ఉన్నది. రెండు సార్లు సర్పంచ్‌గా, ఒక సారి ఎంపీటీసీగా పని చేశా. నేను సామాన్య రైతునే అయినా రుణమాఫీ కాలేదు. మా గ్రామంలో కేవలం 15 మందికి మాత్రమే రుణమాఫీ అయింది అంటే రాష్ట్రం మొత్తం పరిస్థితి ఎంటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలె.

– తిరుమల్‌రెడ్డి రాయపురెడ్డి, రెడ్డిపాలెం, గూడూరు మాజీ సర్పంచ్



### ఒకే రేషన్ కార్డు ఉన్నదని మాఫీ చేయలె..

మా కుటుంబంలో నేను, మా నాన్న, మా అబ్బాయి కలిసి బ్యాంకులో రూ. 4 లక్షల వరకు అప్పు తీసుకున్నాం. మా కుటుంబంలో ఎవరికైనా సరే రూ. 2 లక్షల రుణ మాఫీ అవుతదనుకున్నా. కానీ ఎవరికీ మాఫీ కాలె. ఇదెక్కడి అన్యాయమంటూ బ్యాంకు, వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లా. మీరంతా ఒకే కుటుంబం వారంటూ ఏవేవో సాకులు చెప్పిండ్రు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఓటు వేసి ఎంత మోసపోయినమో అర్థమైంది. మా కుటుంబ సభ్యులందరికీ రుణ మాఫీ చేయాలె. ఎవరిదివారమే ఎవుసం చేసుకుంటున్నాం. మాకెందుకు మాఫీ చేయరు. సీఎం రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పడమే కాని ఆచరించరా.. ఇదేమి ప్రభుత్వం.. ఇదివరకెప్పుడు మాకు ఇలా కాలె. కేసీఆర్ ఉన్నప్పుడు అందరికీ న్యాయం జరిగింది.

– రవీందర్‌రెడ్డి, సిద్దాపూర్, కొత్తూరు మండలం



### రూ.2 లక్షలు దాటిందని మాఫీ కాలె..

నేను రూ. 2 లక్షల రుణం తీసుకున్నా. వడ్డీతో ఎక్కువైంది. పైన పైసలు కడితేనే అర్హుడవు అని బ్యాంకు వాళ్లు చెప్పిండ్రు. అప్పుడెమో ఎంత రుణం ఉన్నా రూ. 2లక్షల వరకు మాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పిండు. ఇప్పుడేమో నానా ఇబ్బందులు పెడుతున్నాడు. రుణమాఫీ కొందరికేనా అందరికి చేస్తరో అర్థం కావడం లేదు. ఇలా చేస్తే కాంగ్రెస్‌కు రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదు.

– ఎల్లయ్య, ఎస్‌బీపల్లి, కొత్తూరు మండలం



### రూ. 80 వేల రుణం తీసుకున్నా మాఫీ కాలె..

నేను యూనియన్ బ్యాంకులో రూ. 80 వేలు తీసుకున్నా. రెండో విడుతలో రుణమాఫీ అవుతదనుకున్నా. బ్యాంకుకు, వ్యవసాయ అధికారి వద్దకు వెళ్లినా.. అన్ని కరెక్టు ఉన్నయంటున్నారు కానీ మాఫీ ఎందుకు కాలేదో చెబుతలేరు. మూడో విడుతలనన్న అయితదనుకున్నా.. అయినా కాలె. కాంగ్రెస్ సర్కారు అందరికీ మాఫీ చేయదా.. అని అడిగితే వాళ్లు సమాధానం చెప్తలేరు. ఇప్పటికైనా రైతులందరికీ రుణమాఫీ చేయాలె. కాంగ్రెస్ సర్కార్ రైతులపై కపట బుద్ధి చూపించవద్దని కోరుకుంటున్నా.

– కోట రామచంద్రయ్య, పెంజర్ల



### రూ. 40 వేలు కూడా మాఫీ కాలె..

నేను రూ. 40 వేలు క్రాప్‌లోన్ తీసుకున్నా. రూ. 2 లక్షల వరకు మాఫీ అంటే ఎంతో సంతోషపడినా. మొదటి విడుతలోనే నా అప్పు పోతదనుకున్నా. కానీ మూడు విడుతలు దాటినా కూడా మాఫీ కాలె. ఇగ రోజూ బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నా. కాంగ్రెస్ సర్కార్ ఈ అబద్ధపు మాటలు ఎందుకు చెప్పాలె. రైతులను నమ్మించి మోసం ఎందుకు చెయాలె. రైతుల ఉసురు తగులుతది. ఇప్పటికైనా రైతులందరికీ రుణమాఫీ చేయాలె.

– కృష్ణ, కొడిచెర్ల

# మాఫీ అందని ద్రాక్షేనా?



**అర్హత ఉన్నా.. కాని రుణమాఫీ**

**బ్యాంకు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు**

**కేసీఆర్ హయాంలో రైతుకు లబ్ధి.. ఏ కష్టం రాలె..**

**కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏదీ ? ఇదేనా ప్రజాపాలన**

**కొర్రీలు, షరతులతో రైతులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

**రుణ మాఫీపై స్పష్టత ఇవ్వలేకపోతున్న బ్యాంకు, వ్యవసాయ అధికారులు**

**ఏదేమీ సర్కారు దేవుడా అంటూ ఆందోళన చెందుతున్న అన్నదాతలు**

**కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఏ షరతుల్లేకుండా రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని అన్నదాతలను మాయ చేసి అధికారంలోకి రాగానే మొండి చెయ్యి చూపుతున్నది. నిబంధనల పేరుతో ఎన్నో కొర్రీలు పెడుతూ రుణమాఫీని ఎగ్గొట్టాలని చూస్తున్నది. అప్పుపోతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతుల నోట్లో మట్టికొడుతున్నది. మాకెందుకు కాలేదు దేవుడా.. మేమేం పాపం చేశాం.. అని రైతులు దిగులుచెందుతున్నారు. నిత్యం బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చాలా మంది రైతులు అర్హులైనప్పటికీ జాబితాలో పేర్లు రాకపోవడంతో ఇక రుణ మాఫీ అందని ద్రాక్షేనా.. అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.**



కొడంగల్, ఆగస్టు 23 : ప్రభుత్వం అమలు చేస్తున్న రుణ మాఫీ పథకం రైతులకు అందని ద్రాక్షలా మారిందని, అర్హత ఉన్నప్పటికీ లబ్ధి పొందలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. మూడు విడుతల్లో రుణమాఫీ చేసినా ఇంకా సగానికిపైగా రైతులకు మాఫీ కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే కొర్రీలు పెట్టి కోతలు విధిస్తున్నదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులను గోసపెట్టిన ఏ పార్టీ మనుగడ సాధించలేదని, రాబోవు రోజుల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని అన్నదాతలు హెచ్చరిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఎన్నో ఆశలు పెట్టి అధికారంలోకి రాగానే నట్టేట ముంచుతున్నాడని మండిపడుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతుల్లేకుండా రైతులందరికీ పంట రుణాలను మాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు వేరు పడితే వేర్వేరుగా ఎవుసం చేసుకోరా.. రేషన్ కార్డు ఒక్కటే ఉంటే మాఫీ చేయరా.. ఆధార్ కార్డులోనూ చిన్నచిన్న పొరపాట్లు ఉన్నాయని సాకులు చెబుతారా.. అంటూ అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. అప్పు ఉంటే చాలు.. తీసుకోనివారుంటే బ్యాంకుకు వెళ్లి తెచ్చుకోండి.. అని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడెందుకు ఇన్ని నిబంధనలు పెడుతున్నారో తెలుపాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.2 లక్షల కంటే అప్పు ఎక్కువగా ఉంటే మిగిలిన డబ్బులు చెల్లిస్తేనే మాఫీ అని కొర్రీలు పెట్టడం సరికాదని అన్నదాతలు దమ్మెత్తిపోస్తున్నారు. అన్ని అర్హతలు ఉండి.. తెచ్చుకున్న రూ.లక్షలోపు రుణాలు కూడా మాఫీ చేయకపోవడం వంటి.. కాంగ్రెస్ ప్రభుత్వ ధోరణి చూస్తుంటే అన్నదాతలను మోసం చేయాలని చూస్తున్నట్లు అర్థమవుతున్నదని నిప్పులు చెరుగుతున్నారు.

### కొడంగల్ మండల పరిధిలో..

మండల పరిధిలోని రుద్రారం యూనియన్ బ్యాంకు పరిధిలో మొత్తంగా 3500 మంది రైతులు రుణాలు తీసుకొన్నట్లు బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో మొదటి విడుతలో రూ.50వేల లోపు రుణాలున్న 757 మంది రైతులకు రూ.4కోట్ల 4లక్షలు మాఫీ కాగా, రెండో విడుతలో 598 మందికిగాను రూ.6కోట్ల 21లక్షలు, మూడో విడుతలో 354 మందికి గాను రూ.3కోట్ల 5లక్షలను ప్రభుత్వం మాఫీ చేసింది. రుద్రారం యూనియన్ పరిధిలోని రుద్రారం, అన్నారం, నాగారం, పాటుమీదిపల్లి, టేకల్‌కోడ్, బోనమ్మతండా వంటి తదితర గ్రామాల్లో కొంతమందికే లబ్ధి చేకూరిందని, ఇంకా సగానికిపైగా రైతులకు రుణమాఫీ కాలేదని మండలంలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కేసీఆర్ హయాంలో ఎలాంటి షరతుల్లేకుండా రూ.లక్షల్లోపు రుణాలను పూర్తి మాఫీ చేశారని, ఎలాంటి కొర్రీలు పెట్టలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎటువంటి ఆంక్షలు విధించకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

### అర్హత ఉన్నా మాఫీ కాలె..



నాకు నాలుగున్నర ఎకరాల పొలం ఉన్నది. రుద్రారం గ్రామంలోని యూనియన్ బ్యాంకులో రూ. లక్షా 45వేల అప్పు తీసుకొన్నా. రుణ మాఫీ అవుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నా. మూడో విడుతలో నా అప్పు పోయినట్టేనని సంబురపడ్డా. జాబితాలో పేరు రాకపోయే సరికి ఆగమైతున్నం. ఏమైందోనని బ్యాంకు కాడికిపోయి అడిగితే అగ్రికల్చర్ కార్యాలయం కాడికి వెళ్లి అడుగు అని చెప్పిండ్రు. ఇగ నా పని రోజూ బ్యాంకు, వ్యవసాయ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడంతోనే సరిపోతుంది. నాతోపాటు వందల మంది తిరుగుతుండ్రు. పనిమానుకుని రోజంతా రుణమాఫీ కోసం తిరుగడం వల్ల నా వ్యవసాయం వెనుకబడుతున్నది. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు రైతులకు ఏ ఇబ్బంది రాలె. రైతుల కష్టాలను తీర్చిండు. కాంగ్రెసోళ్ల మాయమాటలు నమ్మినం. ఇంత మోసం చేస్తరని అనుకోలె.

– శ్రీనివాస్‌రెడ్డి, రుద్రారం, కొడంగల్

### కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలె..



అసెంబ్లీ ఎన్నికలప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చిండు. గద్దెనెక్కిండు ఇచ్చిన మాటను మరిచిండు. రైతులందరికీ ఎలాంటి షరతుల్లేకుండా రుణాలను మాఫీ చేయాలె. ఇంట్లో అన్నదమ్ములు ఉంటే వారు వేరుగా కాపురం పెట్టుకుని ఎవరి వ్యవసాయం వారు చేసుకుంటున్నప్పుడు ఎవరి అప్పు వారే తెచ్చుకుంటరు. ఒకే కుటుంబం అన్న సాకుతో మాఫీ చేయకుండా గోస పెడుతున్నరు. ఇదేమి పద్ధతో కాంగ్రెస్ సర్కార్ ఆలోచించుకోవాలి. రానున్న రోజుల్లో ఇక మీ మాయ మాటలను రైతులు నమ్మే స్థితిలో లేరు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటే మంచిది. లేదంటే రైతులంతా బుద్ధి చెప్పడం ఖాయం. కేసీఆర్ హయాంలో రైతులందరికీ రుణమాఫీ అయ్యింది. అదే మాదిరిగా రైతులందరికీ రుణమాఫీ చేయాలె.

– నారాయణరెడ్డి, రుద్రారం, కొడంగల్

# అక్రమ నిర్మాణాల కూల్చివేత

మొయినాబాద్, ఆగస్టు 23 : మొయినాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. భవన నిర్మాణంలో భాగంగా గోడలు కడుతుండగా వాటిని జేసీబీ సాయంతో అధికారులు కూల్చివేశారు. దానితో పాటు ప్లాట్లకు వేసుకున్న ప్రీకాస్టును సైతం పడగొట్టారు.



మొయినాబాద్ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయిస్తున్న అధికారులు

# అడ్డగోలుగా మట్టి తవ్వకాలు

**పట్టించుకోని అధికారులు.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు**

**సహజ వనరులను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో, కొండలైన కరుగుతాయనెందుకు ఇది నిదర్శంగా మారింది. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామం శివారులో, చెరువు సమీపంలో పెద్ద కొండలు ఉన్నాయి. కొందరు స్వార్థపరులు తమ స్వప్రయోజనాల కోసం కొండలను తవ్వి మట్టిని దోచుకుంటున్నారు. ఈ తతంగం యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ మట్టిని తవ్వుకునేందుకు ఎలాంటి అనుమతులు లేవు. దీంతో రాత్రికి రాత్రే మట్టిని తవ్వుకుపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.**

**- బంట్వారం(కోట్‌పల్లి), ఆగస్టు 23**



# నాగన్‌పల్లిలో పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఏర్పాటు

**స్థలాన్ని పరిశీలించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు**

**అత్యాధునిక హంగులతో నిర్మిస్తామని వెల్లడి**

**గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్న సీపీ**

ఇబ్రహీంపట్నం రూరల్, ఆగస్టు 23 : హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని ట్రైనింగ్ కళాశాల తరహాలోనే రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనూ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో శుక్రవారం రాచకొండ కమిషనరేట్ పరిధి, మండలంలోని నాగన్‌పల్లి గ్రామంలోని సర్వేనంబర్ 291లో ఉన్న స్థలాన్ని కళాశాల నిర్మాణానికి రాచకొండ సీపీ సుధీర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో నిర్మించిన విధంగానే అత్యాధునిక హంగులతో నాగన్‌పల్లిలోనూ కళాశాలను నిర్మిస్తామన్నారు. కళాశాల నిర్మాణానికి ఈ ప్రాంతం అనుకూలంగా ఉండడంతో అవసరమైన చర్యలు ప్రారంభించాలని డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజును సీపీ ఆదేశించారు. అనంతరం సీపీ పోలీస్ అధికారులతో మీటింగ్ నిర్వహించి నేరాలతోపాటు గంజాయి అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. వాహనాల పత్రాల తనిఖీ క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.



నాగన్‌పల్లి సమీపంలో పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు, డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ రాజు